క్లుప్తంగా

ట్రెయినీ కలెక్టర్ సందర్శన



రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్

సంగం : మండలంలోని పడమటిపాళెం, సంగం సచివాలయాలను ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా మంగళవారం సందర్శించారు. సచివాలయంలో ఎన్‌సీఐ రిజిస్ట్రేషన్ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించి ఓటర్ల లిస్ట్‌పై వారికి పలు సూచనలు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి : పట్టణ పరిధిలోని ఎరువుల దుకాణాలను కావలి వ్యవసాయ సహాయ సంచాలకుడు సీహెచ్.నాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ బిల్లుల పుస్తకాలు, ఎరువుల నిల్వలు, తూకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులను కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. స్టాక్ నిల్వల్లో తేడాలుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో వ్యవసాయాధికారులు ఆంజనేయులు నాయక్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువ పనుల ప్రారంభం



ఆత్మకూరురూరల్ : మండలంలోని సాతానుపల్లిలో కాలువల నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమైంది. కరటంపాడు సచివాలయ జేసీఎస్ కన్వీనర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. దీంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

గోవుకు వైద్యచికిత్స



కాలిగిట్టకు చికిత్స చేస్తున్న డాక్టర్

ఆత్మకూరురూరల్ : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ ఆవు కాలిగిట్ట పగిలి రక్తస్రావమైన ఘటన పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి సెంటర్ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. దీనిపై సమాచారం అందుకున్న ఆత్మకూరు పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ జయచంద్ర, డాక్టర్ మౌనిక పశువైద్య సంచార వాహనం ద్వారా ఘటనా స్థలానికి చేరుకుని గోమాతకు వైద్య చికిత్స చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శివకుమార్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటన

చేజర్ల : మండల పరిధిలో జరుగనున్న విజయీభవ యాత్రతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పాల్గొంటారని ఆయన కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. బిల్లుపాడు, యనమదల గ్రామాల్లో పర్యటన ఉంటుందని వెల్లడించింది.

ఊరూ వాడా.. ఆసరా పండగ



ఆత్మకూరు ఆసరా సంబరాల్లో పాల్గొన్న పొదుపు మహిళలు



అల్లూరులో పొదుపు మహిళలతో కిక్కిరిసిన సభా ప్రాంగణం

వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు ఊరూ వాడా పండగ వాతావరణంలో జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో పొదుపు మహిళలు తరలివచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణమాఫీ చేశారని, ఆయనకు తమ మద్దతు ఉంటుందని మహిళలు వెల్లడిస్తున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరై, నమూనా చెక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుంచి నాలుగు శాతానికి తగ్గిందని కేంద్ర ఆర్థిక సర్వేలు తెలుపుతున్నాయని, దీనికి కారణం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే అని వివరించారు. మెప్మా పీడీ డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ ఆత్మకూరుకు రూ.14.56 కోట్లు ఆసరా ద్వారా మహిళలకు అందినట్లు తెలిపారు. పొదుపు మహిళలు ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కామాక్షయ్య నాయుడు, రమాదేవి, రాధిక, నౌషాద్ బేగం, సంధ్యా తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో..

అల్లూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో జరిగిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాలకు మహిళలు విశేషంగా తరలివచ్చారు. ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆసరా నమూనా చెక్కును ఆవిష్కరించారు. అనంతరం సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో నాలుగు విడతల్లో కలిపి మొత్తం 785 సంఘాల్లోని 7,892 మంది సభ్యులకు రూ.22.85 కోట్ల నగదు జమ అయినట్లు వెల్లడించారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్, జేసీఎస్ కన్వీనర్లు ఉస్మాన్, పవన్‌రెడ్డి, నాయకులు మేడా రామకృష్ణారెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, కొండూరు శ్రీను, బి.సుధా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మస్తాన్‌రావు పక్కన ఎమ్మెల్యే రామిరెడ్డి

సంగంలో సర్వసభ్య సమావేశం



సమావేశంలో అధికారులు, నాయకులు

సంగం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ గోపీ మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన అభివృద్ధిపై అధికారులు శాఖల వారీగా వివరించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామ పరిధిలో ఉన్న సమస్యల గురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉదయగిరిలో ఆసరా వారోత్సవాలు

ఉదయగిరి : పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు బుధవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సభా ప్రాంగణాన్ని ఆయన మంగళవారం పరిశీలించి ఏర్పాట్లపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాజారంతుల్లా, సీసీలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు : రాష్ట్రాన్ని అన్నివిధాలా ప్రగతి పథంలో నడుపుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల దృష్టిలో సంక్షేమ సారథిగా పేరు పొందారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. దుత్తలూరులో మంగళవారం జరిగిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో ఆయన పాల్గొని, నమూనా చెక్కును అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే మరలా జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి తండ్రికి మించిన తనయుడిగా పేరు పొందారన్నారు. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, తనను ఆదరించాలని కోరారు. టీడీపీ నేతలు, పచ్చ బ్యాచ్ దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆడుదాం ఆంధ్రా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందించి షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి.వాసుదేవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మండ్ల శివ, స్థానిక నేతలు ఎల్వీ.మాలకొండారెడ్డి, శ్రీహరినాయుడు, నెల్లూరు వెంకటరెడ్డి, దశరథరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ డి.శేషారెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



ఉదయగిరి : మందులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు



సోమశిల : ఆమనిచిరువెల్లలో..

ఉదయగిరి : పేదల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడనరవ గ్రామంలో ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం మంగళవారం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ వైద్యసేవలను చేరువ చేసేందుకు ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన రక్త, చక్కెర, రక్తపోటు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పనారెడ్డి, ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య, సీహెచ్‌ఓ శివకుమారి, కార్యదర్శి కరీముల్లా, నాయకులు మహ్మద్‌ఖాజా, బి.వెంకటేశ్వర్లు, కె.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆమనిచిరువెల్లలో..

సోమశిల : అనంతసాగరం మండలంలోని ఆమనిచిరువెల్ల ప్రాథమిక పాఠశాలలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మొత్తం 580 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏప్రిల్ వరకు జరుగుతాయని, నెలకు 3 క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

చేజర్ల : మండలంలోని చిత్తలూరు సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లకు కుష్టు వ్యాధిపై పీహెచ్‌సీ డాక్టర్ జ్యోతి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు అవగాహనతో కుష్టు వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. తొలుత గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.విజయమ్మ, సీహెచ్‌ఓ బి.మంజుల, ఆశా వర్కర్ వసంత పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

కలిగిరి : ప్రతిఒక్కరూ కుష్టు వ్యాధిపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారిణి బి.గీతారెడ్డి తెలిపారు. కృష్ణారెడ్డిపాళెం గ్రామ సచివాలయంలో కుష్టువ్యాధిపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు లెప్రసీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ మహాలక్ష్మమ్మ, వైద్యసిబ్బంది ప్రసాద్, పి.ప్రఖ్యాతి, పి.మమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలివి వలలతో వేట సాగిస్తే చర్యలు



ఎస్సైకు ఫిర్యాదు అందజేస్తున్న ఏడీ

సోమశిల : సోమశిల జలాశయంలో అలివి వలలతో వేట సాగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ ఉపసంచాలకుడు శ్రీనివాసులు సోమశిల పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై భోజ్యానాయక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల జలాశయంలో లైసెన్సులు లేకుండా చేపల వేట కొనసాగించరాదని తెలిపారు. అలివి వలలు జలాశయంలోకి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర జిల్లాల నుంచి వేట సాగిస్తున్న వారిపై నిఘా వేశామని వివరించారు. అసిస్టెంట్ మత్స్యశాఖాధికారి గోపీచందన తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీ

మర్రిపాడు : మండలంలోని ఇర్లపాడు మండల ప్రజాపరిషత్ పాఠశాలలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పాఠశాలలోని ఆఫీస్‌రూమ్ తాళాలు పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు డిజిటల్ టీవీ, ఆరు సిలింగ్ ఫ్యాన్లు ఎత్తుకెళ్లారు. ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు చోరీ జరిగినట్లు గుర్తించి మర్రిపాడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇటీవల చిన్నమాచనూరులోని ఓ షాపు తాళాలు పగులగొట్టి సామగ్రిని, నగదును గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిని మరువక ముందే మరో చోరీ ఘటన చోటుచేసుకుంది.

జాతిపితకు ఘన నివాళి



చేజర్ల : గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నేతలు



ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయం వద్ద..



సోమశిల : మహాత్ముని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చేజర్ల : జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం గాంధీ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీ సేవలు మరువలేనివని కొనియాడారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పువ్వాడ శ్రీనివాసరావు, సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు దామోదర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

- ఆత్మకూరురూరల్ : మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గాంధీ వర్ధంతి వేడుకలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఏఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని, ఆయన సేవలను కొనియాడారు.
- సోమశిల : చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, వెంకటేశ్వర్లు, రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి, శివకృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.
- అనంతసాగరం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ నారాయణరావు ఆధ్వర్యంలో జాతిపిత వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.మహబూబ్‌బాషా, మండల ఐఆర్పీ నరసింహ, బాలభారతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..

కావలి : పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కార్యాలయంలో గాంధీ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, మండలి కృష్ణారావు, అమరా వేదగిరి గుప్తా, తిరువీధి ప్రసాద్, ఏగూరు చిన్నపుల్లయ్య, తోట శ్రీహరి, కలికి శ్రీహరిరెడ్డి, పరుసు మాల్యాద్రి, శారద ఫణీంద్ర పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డును పూర్తి చేయాలని వినతి

ఉదయగిరి : అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి–బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం నేత వెంకటయ్య కొండకింద గ్రామాల ప్రజలతో కలిసి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ అనుమతులు లేక దశాబ్దాలుగా 3.2 కి.మీ మేర నిలిచిన ఘాట్‌రోడ్డు నిర్మాణం వల్ల 16 గ్రామాల్లోని 18 వేల మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన మేకపాటి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతామని ఆయన హామీ ఇచ్చారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

అగ్ని ప్రమాదంపై ఎంఈఓ విచారణ

ఉదయగిరి : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ఎంఈఓ తోట శ్రీనివాసులు మంగళవారం విచారణ చేపట్టారు. ప్రమాదానికి గురైన స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆకతాయిల వల్ల నిప్పులు చెలరేగి ప్రమాదం జరిగి ఉండొచ్చని వివరించారు. ఆయన వెంట హెచ్‌ఎం బాలకేశవులు, సీఆర్‌ఎంటీ ఇనాయతుల్లా సిబ్బంది ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు

- ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

అల్లూరు: కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు అందుతోందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. రూ.4.75 కోట్లతో నిర్మించిన అల్లూరు ప్రభుత్వాస్పత్రి మొదటి అంతస్తు భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇక్కడ కేవలం ఒకే డాక్టర్ ఉండేవారని, మందులు కూడా ఉండేవి కాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వాస్పత్రి రూపురేఖలే మారిపోయాయన్నారు. సీఎం చొరవతో ఇప్పుడు తొమ్మిది మంది డాక్టర్లు, 44 మంది సిబ్బందితో పాటు అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో ఓపీలు రోజుకు పది వస్తే, ఇప్పుడు 200 నుంచి 250 వరకు ఓపీ పెరిగిందన్నారు.



రిబ్బన్‌కట్ చేసి ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి

అందుబాటులోకి స్టెమీ ఇంజెక్షన్

ఇటీవల గుండె సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వాస్పత్రుల్లో దాదాపు 50 వేల విలువ చేసే స్టెమీ ఇంజెక్షన్లు అందుబాటులోకి వచ్చాయని ఎంపీ బీద మస్తాన్‌రావు అన్నారు. ఎవరికైనా గుండెపోటు వచ్చే సూచనలు ఉంటే వెంటనే ఈసీజీ తీసి నిర్ధారించిన తర్వాత స్టెమీ ఇంజెక్షన్ వేస్తే వారి ప్రాణాలను కాపాడ వచ్చన్నారు.

వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షలు

నార్త్‌ఆములూరుకు చెందిన వలంటీర్ మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా అతని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చెక్కును ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఆసరా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నిరుద్యోగులకు పుస్తకాలను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఏడీఎఫ్ ఆధ్వర్యంలో గ్రూపు-2 పరీక్షకు హాజరుకానున్న నిరుద్యోగ యువతకు పరీక్ష మెటీరియల్‌ను అందజేశారు. పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. మెప్మా సిబ్బందికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తన సొంత ఖర్చులతో గిఫ్ట్‌లు అందజేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్ విజయజ్యోతి, వినయ్‌కుమార్‌రెడ్డి, మైనార్టీ నేతలు పర్వీన్, రిజ్వాన్, రహీం, జమీర్, కలాం తదితరులు పాల్గొన్నారు.